క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై యాసిన్ అరాఫత్

నిజామాబాద్అర్బన్: నగరంలోని కోటగల్లీలో ఉన్న పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ క్లబ్ ప్రోగ్రాంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రెండో టౌన్ ఎస్సై యాసిన్ అరాఫత్, షీ టీం ఎస్సై స్రవంతి హాజరై విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి మల్లేశం, మాధవి, రజని, గంగా కిషన్, శైలేష్ దామోదర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏఐ ద్వారా విద్యా బోధన ప్రారంభం


ఏఐ విద్యా బోధనను ప్రారంభిస్తున్న ఎంఈవో

సిరికొండ: మండలంలోని రావుట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా విద్యా బోధనను ఎంఈవో రాములు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఏఐ ద్వారా విద్యార్థులకు బోధన సులభంగా అర్థమయ్యేలా వారే సొంతంగా మూల్యాంకనం చేసుకునే విధంగా కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. దీనిని విద్యార్థులకు సక్రమంగా అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పీజీహెచ్ఎం శ్రీనివాస్, రాజేశ్వర్ హెచ్ఎం విజేత, ఉపాధ్యాయులు బాలయ్య, దయాల్ సింగ్, ఉమా, శేఖర్, వీణ, శివాణి, నవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీఏ సభ్యుడు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న రాజనరేందర్

నిజామాబాద్ సిటీ: ఆర్టీఏ సభ్యుడిగా నియామకమైన రాజ నరేందర్‌గౌడ్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును శనివారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

తెయూకు ఈశ్వరీబాయి పేరు పెట్టాలి


షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయానికి తెలంగాణ పోరాట యోధురాలు ఈశ్వరీ బాయి పేరు పెట్టాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో శనివారం వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం జైలు పాలైన మొట్టమొదటి మహిళా నాయకురాలు ఈశ్వరీ బాయి అని అన్నారు. తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో అలుక కిషన్, గంట సదానందం, సిద్ధిరాములు, కొక్కెర భూమన్న, మోహన్ రావు, సక్కి ఉదయ్, గొరికంటి లింగన్న, వెంకట రమణ, కిరణ్ అనుపాల్, ఇత్వర్పేట్ లింగన్న, అజయ్, అర్గుల్ సురేశ్, తర్ల లక్ష్మణ్, గోలెం అరుణ్, అచ్యుత్, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.


రాయితీని వినియోగించుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై అందిస్తున్న 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈనెల 31 వరకు 25 శాతం రాయితీ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు.

అమ్మో.. చిరుత

- రూరల్ గ్రామ శివార్లలో సంచారం
- భయం గుప్పిట్లో తండావాసులు
- పట్టించుకోని అధికారులు


చిరుత దాడిలో మృతిచెందిన మేక కళేబరం


ప్రతీకాత్మక చిత్రం

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతాల్లో మేత కోసం వెళ్లిన పశువులపై దాడులు చేస్తోంది. దీంతో సమీప తండావాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తాజాగా మండలంలోని మల్కాపూర్(ఎ), మల్కాపూర్ తండాలో చిరుత కనిపించింది. మల్లాపూర్ బీట్ పరిధిలోని మల్కాపూర్ తండాలో రాత్రి సమయాల్లో గుడిసెల్లో కట్టేసి ఉంచిన మేకలపై దాడి చేస్తోంది.

శుక్రవారం రాత్రి సైతం గుడిసెలో కట్టి ఉంచిన మేకను చిరుత దాడి చేసి చంపేసిందని తండావాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రెండు నెలల్లో మల్కాపూర్ తండాలో చిరుత రెండు సార్లు సంచరించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చిరుత నుంచి ప్రజలను, మూగజీవాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాస్తవ పరిస్థితి..

మండలంలోని అటవీ ప్రాంతాలకు దగ్గరగా నివసిస్తున్న తండవాసులు, రైతులు వారికి ఉన్న పోడు భూముల్లో మూగ జీవాలను కట్టేసి ఉంచుతున్నారు. అటవీ ప్రాంతం కావడంతో రాత్రివేళల్లో చిరుత వచ్చి దాడులకు పాల్పడుతోంది. రెండు నెలల క్రితం ఇదే తండాలో మేకల మందపై చిరుత దాడి చేసింది. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

అధికారులు స్పందించడం లేదు



మల్కాపూర్ తండాలో రెండు సార్లు చిరుత వచ్చి మేకలపై దాడి చేసింది. ఈ విషయమై ఫారెస్టు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. అటవీ జంతువుల నుంచి తమను రక్షించాలి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– కెతావత్ ప్రకాశ్ నాయక్, మల్కాపూర్ తండావాసి

రాత్రివేళ బయటకు రావొద్దు



అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నందున తండావాసులు జాగ్రత్తగా ఉండాలి. రాత్రి వేళలో ఒంటరిగా బయటకు రావొద్దు. అటవీప్రాంతంలో మేకలు, ఇతర పశువులను వదిలివేయవద్దు. చిరుతను పట్టుకునేందుకు తగు చర్యలు చేపడుతున్నాం.

– సంజయ్ గౌడ్, ఎఫ్ఆర్‌వో

ట్రాన్స్‌ఫార్మర్‌కు రైతుల మరమ్మతులు

- పంటలకు సాగునీరు అందడం లేదని..
- విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో..


ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న రైతులు

మోపాల్: మండలంలోని ఎల్లమ్మకుంట శివారులో ట్రాన్స్‌ఫార్మర్ లోపల తీగ తెగిపోవడంతో శుక్రవారం సాయంత్రం రైతులే మరమ్మతులు చేపట్టిన ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేసేందుకు రావడం ఆలస్యమవుతుందని, పంటలకు సాగునీరు త్వరగా అందాలనే ఉద్దేశంతో తామే మరమ్మతులు చేపట్టామని రైతులు పేర్కొన్నారు. మరమ్మతులు చేసే సమయంలో విద్యుత్ సరఫరా అయి, ఏదైనా ఘటన జరిగితే బాధ్యులెవరని చర్చ జరుగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ తీగ తెగిపోవడంతో రైతులు లైన్‌మన్ మురళీని సంప్రదించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జూనియర్ లైన్‌మన్ మహేశ్ బదిలీ కావడంతో మురళికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన వస్తున్నానని సమాధానమిచ్చినా.. ఆలస్యమవుతోందని భావించిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు. లైన్‌మన్ అక్కడికి వెళ్లేలోపే మరమ్మతులు పూర్తిచేశారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రైతులు సబ్‌స్టేషన్‌లో అనుమతి తీసుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారని కొందరు.. ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేశారని మరికొందరు పేర్కొంటున్నారు. ఇదే విషయమై మోపాల్ ఏఈ నాగశర్వాణి ని వివరణ కోరగా, రైతులు మరమ్మతులు చేసిన విషయం తనకు తెలియదని, సోషల్ మీడియా ద్వారా తెలిసిందన్నారు. ఇకముందు రైతులకు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలే తప్ప అలా చేయొద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

చట్టం అందరికీ ఒకేలా ఉండాలి

నిజామాబాద్ సిటీ: పోలీసు కస్టడీలో మృతిచెందిన సంపత్‌ను క్రైం పోలీసులు కస్టడీలోకి తీసుకున్న తర్వాత సమాచారం ఇవ్వకుండా ఉల్లంఘనలకు పాల్పడ్డారని బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు, వడ్డెర సంఘం నేత దండి వెంకట్ శనివారం మండిపడ్డారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ.. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని, సాధారణ పౌరులకు ఒకరకంగా ప్రముఖులకు మరోరకంగా ఉండటం ఏమేరకు న్యాయమని ప్రశ్నించారు. సంపత్ వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన వ్యక్తి కావడంతోనే పోలీసులు క్రూరంగా హింసించి ఆయన మరణానికి కారకులయ్యారని అన్నారు. ఆయన లైసెన్స్ కలిగిన గల్ఫ్ ఏజెంట్ అయినా కోర్టు నుంచి అనుమతి తీసుకుని విచారించే సమయంలో కుటుంబ సభ్యులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. సంపత్ కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

మైనారిటీల అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న షబ్బీర్ అలీ, నాయకులు


ముస్లింలకు రంజాన్ కిట్లు అందిస్తున్న షబ్బీర్ అలీ

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్డులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. హిందూ–ముస్లిములు తనకు రెండు కళ్లలాంటి వారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ

జిల్లా కేంద్రంలో పేద ముస్లిములకు రంజాన్ కిట్లు, నిత్యావసర సామగ్రిని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ అందజేశారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ద్వారా ప్రతి ఏడాది పేద ముస్లిములకు రంజాన్ కిట్లను అందించడం సంతోషంగా ఉందన్నారు.

ఈద్గాల పరిశీలన

జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానాలను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పరిశీలించారు. నగరంలోని జదీద్ ఈద్గా, మదీనా ఈద్గా, ఐలేహదీస్ ఈద్గాలను మైనార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ఇతర నేతలతో కలిసి పర్యటించారు. రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈద్గాల వద్ద పిచ్చిమొక్కల తొలగింపు, గుంతలు పూడ్చడం, తాగునీటి వసతి, విద్యుద్దీపాల ఏర్పాటు లాంటి వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు.

కల్యాణం.. కమనీయం


పూజలు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని గంగస్థాన్ ఫేస్–2లో ఉత్తర తిరుమల క్షేత్రం ఆలయ 5వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా శ్రీనివాసుని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యహోమం, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి పుర వీధుల గుండా ఊరేగించారు. స్వామి వారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సిక్కుల శోభాయాత్ర


కత్తులతో విన్యాసం చేస్తున్న యువకులు


నిజామాబాద్ రూరల్: హోలిని పురస్కరించుకొని నగరంలోని గురుద్వార్ వద్ద సిక్కులు శోభాయాత్రను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుద్వార్ నుంచి ఇంద్రపూర్ గురుద్వార్ వరకు గురు గ్రంది ఊరేగింపు నిర్వహించారు. సిక్కులు హోలీ ఆడుతూ.. కత్తి విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో సిక్కులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

26న 'తెలుగు సాహిత్యం–ప్రదర్శన కళలు'పై వర్క్‌షాప్


కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నిజామాబాద్అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో కొరవి గోపరాజు తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26న 'తెలుగు సాహిత్యం ప్రదర్శన కళలు' అనే అంశంపై కార్యశాల నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నంతో కలిసి శనివారం ఆవిష్కరించారు. తృతీయ సంవత్సరం విద్యార్థుల సిలబస్‌కు అనుబంధంగా ఈ కార్యశాలను రూపొందించడం జరిగిందని ప్రముఖ వ్యాఖ్యాత వీపీ చందన్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామస్వామి, రాజేశ్, భరత్ రాజ్, వినయ్ కుమార్, బాలమణి, రాజేశ్వర్, రాధిక, గంగాధర్, అర్చన, సవిత, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పై' దినోత్సవం


పై ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో అంతర్జాతీయ గణితం, పై దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు పై ఆకారంలో కూర్చుని గణిత ఆకాంక్షను వెలిబుచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా కుటుంబానికి ఆర్థిక దీమా అని శ్రీరామ్ లైఫ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని అశోక్ ఫారం గ్రామానికి చెందిన షేక్ హలీం బీ అనే మహిళ మూడేళ్ల క్రితం. రూ. 3వేలుతో శ్రీరామ్ లైఫ్‌లో ఇన్సూరెన్స్ చేశారు. ఇటీవల పాలసీదారురాలు మరణించగా ఆమె భర్త షేక్ ఆదం సాహెబ్‌కు మంజూరైన రూ. ఆరు లక్షల 30వేల నగదును శ్రీరామ్ లైఫ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో మెట్టు అశోక్ కుమార్, రమణి, మోహన్‌రావు, కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు పాటల పోటీలు

ధర్పల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీలో భగత్‌సింగ్ స్మారక క్రీడా పోటీల్లో భాగంగా విద్యార్థినులకు శనివారం పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హాజరై మాట్లాడారు. విదేశీ సంస్కృతితో పల్లెల్లోకి డీజేలు వచ్చి జానపద గేయాలు కనుమరుగు అవుతున్నాయని అన్నారు. పల్లెల జానపదాలను, సంస్కృతిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుమలత, నాయకులు బాలయ్య, భూమేశ్, సంజీవ్, గంగారాం, ఎల్లయ్య, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18న తైబజార్ వేలం

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి మేజర్ జీపీకి సంబంధించిన తైబజార్ వేలం ఈనెల 18న నిర్వహించనున్నట్లు జీపీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఈ తైబజార్ వేలం వర్తిస్తుందని అన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ. 50 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	82,047	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
చిర్రిసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	10	20	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దిల్‌రూబా(తెలుగు)-11.00, 4.35, 7.30, 10.25 -ఛావా(హిందీ)-1.40
స్క్రీన్-2	యుగానికి ఒక్కడు(తెలుగు)-11.00, 4.40 కోర్ట్(తెలుగు)-1.45, 7.35, 10.30
స్క్రీన్-3	ఆఫీసర్ ఆన్ డ్యూటీ (తెలుగు)-1.30, 7.30 -ఛావా(తెలుగు)-4.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(తెలుగు)-10.00, 4.15 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.20 కోర్ట్(తెలుగు)-7.35, 10.40
స్క్రీన్-2	కోర్ట్(తెలుగు)-10.00, 4.25 ఛావా(తెలుగు)-1.05, 7.30 ఛావా(హిందీ)-10.50
స్క్రీన్-3	ఛావా(హిందీ)-10.30, 1.50 ల్యాంప్(తెలుగు)-5.10 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.35 యుగానికి ఒక్కడు(తెలుగు)-10.45
స్క్రీన్-4	దిల్‌రూబా(తెలుగు)-10.15, 4.10, 7.20, 10.30 1000 వాలా(తెలుగు)-1.25

లలితామహల్	కోర్ట్ (తెలుగు)
దేవి	దిల్‌రూబా(తెలుగు)
నటరాజ్	యుగానికి ఒక్కడు (తెలుగు)
విజయ్	ఛావా (తెలుగు)

బహుజన బాంధవుడు కాన్షీరాం


కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: బహుజనులను రాజ్యాధికారానికి దగ్గర చేసిన వారు కాన్షీరామ్ అని సీనియర్ న్యాయవాది ఘంటా సదానందం, టీజీవో అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతిని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దళిత బహుజనుల రాజ్యాధికారం కోసం తన జీవితాంతం నిరంతరం పోరాటం చేసి యూపీలో తన కన్న కలలు దళితులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారాన్ని అందించడం జరిగిందన్నారు. నేడు యూపీ తర్వాత ఏపీ అనే నినాదంతో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో దళితుల రాజ్యాధికారం కోసం నిరంతరం కృషి చేసిన కృషివలుడు మాన్యశ్రీ కాన్షీరాం అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మదాలె అజయ్, బత్తుల కిష్టయ్య, సాయినాథ్ గైక్వాడ్, షేక్ మిరాజ్, లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్బందిగా మారిన గేటును తొలగించాలి


సీపీ కార్యాలయం ఎదుట తగిలేపల్లి గ్రామస్తులు

ఖలీల్‌వాడి: వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలోని పెరిక సంఘం సభ్యులు నిర్మించిన ఫంక్షన్ హాల్ గేట్‌తో గజ్జెలమ్మ ఆలయానికి ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు కలెక్టర్, సీపీకి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. జీపీ అనుమతి లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మించారని, అలాగే గేటు ఏర్పాటు చేయొద్దని చెప్పినా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ గేటు ఏర్పాటుతో భక్తులు ఆలయంలోకి వెళ్లలేకపోతున్నారని అన్నారు. అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాములు, గైని గోపి, శ్రీనివాస్, గోపి తదితరులు పాల్గొన్నారు.